స్కెచ్

# ఫైవ్ నాట్ ఫోర్

—టి. యల్. నరసింహారావు

పాపయ్య తన పేరు మరచిపోయి. పదేళ్ళయింది. పోలీసుస్టేషన్‌లో అడుగు పెట్టి, ఎస్.ఐ. అందించిన అరవీస బరువు బుట్టటోపీ నెత్తిన పెట్టుకొని, గజం పాతిక పొడుగు దుడ్డుకర్ర చేతిలోకి తీసుకున్న మరుక్షణం పాపయ్య కాస్తా ఫైవ్ నాట్ ఫోర్ అయిపోయాడు. విక్టోరియా రాణి కిరీటం పెట్టుకొన్న రోజు కుంపినీ రాజ్యానికి పండగ రోజైతే తనకూ తన పెళ్ళాం లచ్చిమికీ యిది పండుగ రోజనుకొన్నాడు పాపయ్య.

హెడ్డుగానీ, ఎస్.ఐ గానీ తనపైవాడు ఎవడైనా సరే. వాడినోట "ఫైవ్ నాట్ ఫోర్" అన్న అంకె వినబడితే చాలు పాపయ్య బూట్ల మడమలు టక్కున చప్పుడుచేసేవి. శరీరం అమాంతం బిగుసుకు పోయేది. కుడిచేయి, మీట నొక్కినంత వేగంగా మొగానికి అడ్డంపోయి సెల్యూట్ కొట్టేది.

ఫైవ్ నాట్ ఫోర్ బజార్న నడుస్తుంటే చూసేవారికి, లాఅండ్ ఆర్డర్ భారమంతా అతడు తన భుజాల మీద, కాకపోతే నెత్తిమీద మోస్తున్నట్లుండేది. పాపిష్టి భూభారాన్ని నెత్తినెత్తుకొని మోస్తున్న ఆదిశేషుడి ఆకారం వారి మనస్సులో మెదిలేది. అతడి చేతిలో లాఠీ అనుక్షణం అదో వయ్యారంగా నాట్యమాడుతుండేది.

పాపయ్యకు దస్సులో వున్నప్పుడు తాను బాగా ఎరిగిన మనుషుల పేర్లు కూడా గమనంలో వుండేవి కావు. చిన్నప్పుడు వీధిబళ్లో కలసి చదువుకొన్న రిక్షా తొక్కే రాముడు తారసిల్లితే "ఏయ్ రిక్షా" అని పిలిచేవాడు. తనపొరుగింటి లారీ డ్రైవర్ రంగయ్యను "ఏయ్‌లారీ" అం కేక వేసేవాడు. ఇంటికి రాగానే, గడపల్లో మంచాన పడివున్న ముసిలాడు "పాపడూ, వచ్చావా?" అని నోరారా పలకరిస్తే, క్షణంసేపు "ఎవర్నీ" అన్నట్టు బిత్తరపోయిచూచేవాడు తనకొడుకు ఆరేళ్ళవాడు యిరుగు పొరుగు పాకల్లోని పిల్లల్తో గోలికాయలాడుతుంటే "అణ్ణి లేబరోళ్ళతో తిరగనివ్వమాక....

ఆళ్ళ బుద్ధులే ఈడికీ అబ్బుతాయని" తన పెళ్ళాన్ని మందలించేవాడు. కాస్త హుషారుతోచినప్పుడు. వాణ్ణి మంచంలో తన పక్కన పడుకోపెట్టుకొని.

"నువ్వు బాగా సదువుకోవాలి.... మఠిక్లేసను పాసై ఎస్సైఅయిపోవాలి" అని బుద్ధులు చేప్పేవాడు. లచ్చిమిని పాకల్లో ఆడంగులంతా "పోలీసాయన పెళ్ళాం" అనిపిలుస్తుంటే, ఆమెవాళ్ళతో మాట్లాడేటప్పుడు తన మొగుడి గురించి చెప్పాల్సొస్తే "మాపోలీసాయన "అంటుంటే ఫైవ్ నాట్ ఫోర్ ఉరఫ్ పాపయ్య

ఆనందానికి పట్ట పగ్గాలుండేవి కాదు. పాపయ్యకు పైవాళ్ళను చూస్తే ఆకాశంలో మిలమిల్లాడేచుక్కల్ని చూసినట్లుండేది. రిక్షా తొక్కే రాముణ్ణి, లారీతోలే రంగయ్యనూ, యిలాంటి ఆమాంబాపతును చూస్తే చీమల్నీ, దోమల్నీ చూచినట్లుండేది. కిందటేడు పెద్దబజారులో కొట్లదగ్గర దొమ్మి జరిగినప్పుడూ, లారీ డ్రైవర్లు సమ్మె కట్టినప్పుడూ, యింకా యిలానే చాలా సార్లు రామయ్య మీదా, రంగయ్యలమీదా పాపయ్య తన లారీని నాట్యం చేయించాడు.

నిన్న ప్రొద్దు గూకే వేళ్ళప్పుడు పాపయ్య ఆకలితో ఆవురావురు మంటూ పాకకు తిరిగొచ్చి, గడపల్లోనుంచే, "లచ్చీ, బేగి బువ్వొంచు, కడుపుకాలి పోనాది" అనికేక పెట్టాడు.

"ఈ పూటనూకలు సిక్కనేలేద య్యోయ్, పోలీసాయనా "అని కుండలు కడుక్కుంటున్న లచ్చి జవాబువిని ఫైవ్ నాట్ ఫోర్ నీరుకారిపోయాడు ....బుట్ట టోపీతీసి వంకెన తగిలించాడు. నడుము బెల్టు తీసి కుక్కిమంచం మీదికి విసిరేసాడు ప్రొద్దుటినుంచీ పొట్టను నాయకట్టి వుంచిన బెల్టు కాస్తే తొలగిపోయేసరికి అతడి పేగులు గుర్రుమన్నాయి. వంకీనున్న సంచి తీద్దామని తలపైకెత్తేసరికి మిలమిల మెరుస్తున్న ఫైవ్ నాట్ ఫోర్ యిత్తడిబిళ్ళ అతణ్ణి వెక్కిరించింది. ఫైవ్ నాట్ ఫోర్ పాపయ్యగా మారి, సంచీ చేత పుచ్చుకొని సందులోకొచ్చాడు.

---

# పరీవాహం

గస్తీ....గస్తీ...గస్తీ....
కడిగి ఆరేసిన పేగుల
సముద్రపు ఘర్జన,
కన్నీటి కడలిలో
కల్లోలిత కెరటాల్లా
కళ్ళల్లో కమ్మిన రక్తపుమరకలు,
కణకణావిష్ట, నరనరాన్ని
నమిలేసే చలిలో
భవిష్యదాలోచనల ఫర్నేసులో
మసలు తున్నజీవచ్ఛవాల మస్తిష్కాలు:
శీతలీ కరణ గదుల్లో
నిద్ర రాక
పట్టు పాన్పులపైపొర్లే
కుత్తుకదాక నెత్తురు కక్కిన
జలగలకు
గస్తీ....గస్తీ...గస్తీ....
ఈ సముద్రం వుప్పొంగితే,
ఈ కడలికి కట్టలు తెగిత్తే,
ఈ జీవచ్ఛవాలే విజృంభిస్తే
మరిక—
నాస్తి...నాస్తి....నాస్తి....

—సవేరా